క్లుప్తంగా

హెల్త్ క్లినిక్ ఆకస్మిక తనిఖీ


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవి బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హెల్త్ క్లినిక్‌లో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ క్షయ వ్యాధి రోగులకు, షుగర్ వ్యాధి రోగులకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి అలర్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఈనెల 16 నుంచి మండల పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ప్రతి గురువారం వ్యాక్సినేషన్ టీకాలు వేస్తారన్నారు. ఈ ప్రోగ్రామ్ 3 నెలలపాటు మండల పరిధిలో జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం మండలానికి 234 క్వింటాళ్ల జీలుగలు


రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి

సిద్దవటం : మండలానికి పచ్చి రొట్ట ఎరువులకై 234 క్వింటాళ్ల జీలుగలు, 10 క్వింటాళ్ల జనుముల విత్తనాలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిద్దవటంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జీలుగలు, జనుములు కావలసిన రైతులు ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీలోగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వారం తరువాత విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యంగా ఏ రైతు పేరుతో పట్టాదారు పాస్ పుస్తకం ఉంటుందో ఆ రైతే రైతు భరోసా కేంద్రాలకు వచ్చేటప్పుడు వారి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్, అదే విధంగా డబ్బులు తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన అన్నారు.

ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపు


ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం రమణయ్య

రాజంపేట : ఆదర్శ ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపు ఉంటుందని రాజంపేట డిపో మేనేజరు గుండాల రమణయ్య అన్నారు. గురువారం స్థానిక డిపో కేంద్రంలో డీజిల్ సేవ చేసిన టువంటి డ్రైవర్లకు నగదు బహుమతులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ ఉద్యోగులుగా ఫిరోజ్, ఏపీరాజు నిలిచారన్నారు. వీరు ఇరువురు కేఎంపీఎల్ సాధించారన్నారు. ఈపీకే తెచ్చిన కండక్టరును కూడా ప్రశంసాపత్రాలను ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్యారేజి సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కోనంపేటలో మహాభారత యజ్ఞం

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 17వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు కోనంపేట గ్రామంలో పంచమ వేద మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 17వ తేదీన ధ్వజారోహణ, 21న బలిబండి ఊరేగింపు, 23న ద్రౌపతి కల్యాణం, 27న అర్జున తపస్సు, జూన్ 1న ఇలావతుని వధ, జూన్ 2న దుర్యోధన వధను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించనున్నారు. హరికథ కళాకారిణి హైమావతి ప్రతిరోజూ హరికథ కాలక్షేపం నిర్వహిస్తారు. అలాగే శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి పీలేరు వారిచే రాత్రి వేళల్లో మహా భాగవతం ఘట్టంలోని కొన్ని కార్యక్రమాలు.. అలానే మధ్యాహ్న వేళల్లో అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. గ్రామంలో బాగా వర్షాలు కురిసి ప్రజలు సంపూర్ణంగా ఉండాలనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు.

వైద్య శిబిరం విజయవంతం


వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఉర్దూ హైస్కూల్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. సర్పంచ్ నజీర్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు 150 మంది రోగులు వైద్యశిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

వైభవంగా కోడూరు గంగమ్మ జాతర

- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- పూజలు చేసిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని పాత బజారు వీధిలో గంగమ్మమిట్టలో వెలసివున్న గంగమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 80 సంవత్సరాలకు పైబడా చరిత్ర కలిగిన క్యడి జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు వేలాది మందిగా గంగమ్మ దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పార్టీ నాయకులతో కలిసి గంగమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎన్నికలలో దిగ్విజయం సాధించి ప్రజాసంక్షేమ పాలన కొనసాగాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. పలువురు భక్తులకు


గంగమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

అన్నదానం చేశారు. పట్టణమంతా ప్రత్యేక అంగళ్ళు, రంగులరాట్నాలు, జనాలతో కిటకిటలాడింది. పాతబజారులో అంతా చలువపందిళ్లతో అలంకరించారు. పట్టణంలోని అన్ని వీధులలో విద్యుత్ బొమ్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున స్థానిక అంకాలమ్మ గుడిలో భక్తిశ్రద్ధలతో గంగమ్మను తయారుచేసి ప్రత్యేకంగా ఈ ఏడాది బంగారు కిరీటం ధరింపజేశారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ మిట్టకు తీసుకువస్తుండగా.. భక్తులు అమ్మవారిని జయజయ ధ్వానాలతో వెంట నడిచారు. వేడుక చూడడానికి ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరయ్యారు. గంగమ్మ నడిచేదారిలో మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఉదయం నుండి వేలాది మందిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం పలువురు అన్నదానాలు, మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని గంగమ్మమిట్టకు తీసుకువస్తున్న దృశ్యం


గంగమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న కొరముట్ల

అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్‌రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి బాలబాలికలకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. తమ కళాశాలలో సైన్సు, ఆర్ట్స్‌తోపాటు ఒకేషన్(సీఎస్‌సీ) గ్రూపు కూడా ఉన్నట్లు తెలిపారు. ఇంటర్‌లో చేరబోయేవారికి కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి అడ్మిషన్ కోసం అప్లికేషన్స్ ఇస్తామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వర్షాల కోసం ప్రార్థనలు

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ సమీపంలోని న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో గురువారం పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో సకాలంలో వర్షాలు కురవాలని భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ మహేష్ మాట్లాడుతూ మానవాళితోపాటు సకల జీవరాశులు జీవించేందుకు నీరు కావాలన్నారు. వర్షం కురిసినపుడే రైతులు పంటలు పండించగలరని, తాగునీరు లభిస్తుందన్నారు. దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశామన్నారు.

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 19న దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య తన జీవితాన్ని పేదలకు, కష్టజీవులకు అంకితం చేశారన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథుల్లో సుందరయ్య ఒకరిని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం : గ్రామాలలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం వైద్య సిబ్బంది జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా, కుళాయిలు లీకేజ్ కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.


అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో వైద్యాధికారిణి రంగ లక్ష్మి, సూపర్‌వైజర్‌లు పద్మావతి, రామ్మోహన్, సీహెచ్‌ఓలు వెంకటమ్మ, సంధ్య, లోకేశ్వరి, జాస్మిన్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు రెడ్డిరాణి, పార్వతి, కృష్ణమ్మ, షబానా బేగం, లక్షుమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాధితుడిని ఆదుకోవాలి

వీరబల్లి (రాయచోటి టౌన్) : విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడి తన కుడిచేతిని కోల్పోయిన బెండకాయల శివశంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామం దిగువ రాచపల్లె హరిజనవాడకు చెందిన బెండకాయల శివశంకర్ ఈ నెల 8వ తేదీ విద్యుత్ ప్రమాదంలో ఎడమ చెయ్యి పూర్తిగా కాలిపోయింది. ఆయన్ను పరీక్షించిన వైద్యులు ఎడమ చెయ్యిని భుజం వరకు తొలిగించారు. దీంతో ప్రాణాపాయం నుంచి బయట పడినా ఇక ఏ పని చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కావున


విద్యుదాఘాతంతో ఎడమ చేయిని కోల్పోయిన శివశంకర్

ప్రభుత్వం ఈ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరాడు. అలాగే ఇదే విషయం రాష్ట్ర విద్యుత్ శాఖ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి తమవంతు సాయం చేస్తామని చెప్పారన్నారు. జీవనోపాధి కోసం ఇదే శాఖలో ఉపాధి అవకాశం (ఉద్యోగం) కూడా కల్పించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, రామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డిలు విజ్ఞప్తి చేశారు.

దోమల వృద్ధిని నివారించాలి


నందలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


సంబేపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : నిల్వ ఉన్న నీటిలో అబిట్ ద్రావణం, వేస్ట్ ఆయిల్‌ను చల్లి దోమల వృద్ధిని నివారించాలని మండల వైద్యాధికారి డాక్టర్ కె.శరత్ కమల్ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు డెంగ్యూ వ్యాధి నివారణ నినాదాలు చేస్తూ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్‌లతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పగటిపూట కుట్టే ఈడీస్, ఈజిప్ట్ ఐ టైగర్ దోమవల్ల మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఏఎన్‌ఎంను సంప్రదించడం లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని డాక్టర్లచే వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, సునీల్ కుమార్, ఎంపీహెచ్‌ఓ లక్ష్మయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల సహకారంతో డెంగీ నివారణ చర్యలు చేపడతామని మండల కేంద్రంలోని ప్రాథమిక కేంద్రం వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు తెలిపారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రజల సహకారంతో డెంగ్యూ వ్యాధి నివారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనుమరుగైన 'రైతు రథం'

గుర్రంకొండ: దశాబ్దాల క్రితం రైతు జీవితంలో భాగమైన రైతు రథం నేడు కనుమరుగైంది. ఆరోజుల్లో కాడెద్దు బండీ ఉంటనే రైతుగా గుర్తింపు ఉండేది. పెద్ద చక్రాలతో పైన ఇనుప కమ్మి రక్షణ కవచంగా అప్పట్లో బండ్ల నిర్మాణం జరిగేది. బండి ఇరుసు ముందు భాగంలో కాడిమాను ఏర్పాటు చేసి కాడిమానుకు చెరోవైపు రెండు ఎద్దులను కట్టి బండి మీద రైతుసవారీ చేస్తుంటే ఆదృశ్యాలు కనువిందు చేసేవి. పల్లెల్లో ఎక్కడ చూసిన ఏ ఇంటికి వెళినా కచ్చితంగా రైతు రథమైన ఎద్దుల బండీ ఉండేది. నేటి ఆధునిక యుగ నాగరికతలో ఆ ఎద్దులబండీ స్థానంలో టైర్ల బండి వచ్చింది. పెద చక్రాల బండ్లు ఇళ్లలో మూలనపడ్డాయి. చిన్నచిన్న టైర్ల బండ్లు అందులోనూ ఒకే ఎద్దులాగే విధంగా నేటి ఎద్దుల బండ్లు తయారయ్యాయి. దీంతో ఎన్నో వందల సంవత్సరాల నుంచి రైతుల జీవితాలతో పెనవేసుకుపోయిన నాటి తరం ఎద్దుల బండ్లు నేడు ఆవే పల్లెల్లో రైతుల ఇళ్ల ముందు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.


కొత్తపల్లెలో ఓ రైతు ఇంటి ఎదుట ఉన్న రైతు రథం

అధికారంపై చంద్రబాబువి పగటికలలు

- ఆకేపాటి, కొరముట్లను కలిసిన గల్ఫ్, కువైట్ వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట : అధికారంపై కూటమి పిట్టలదొర చంద్రబాబు పగటికలలు కంటున్నారని గల్ఫ్ కన్వీనరు ఇలియాస్ బీహెచ్ అన్నారు. గల్ఫ్ కో–కన్వీనరు గోవిందు నాగరాజుతో కలిసి గురువారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆకేపాటి అమరనాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ముందుస్తుగా శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉభయ వైఎస్సార్ జిల్లాలో రెండు ఎంపీ స్థానాలను, 14 ఎమ్మెల్యే స్థానాలను భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 135 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేయనున్నారన్నారు. రాజంపేట వైఎస్సార్‌సీపీలో పదవులు పొంది తల్లిపాలు తాగి తల్లిరొమ్మును కాలితో తన్నినట్లు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల అపజయం కోసం కొందరు శతవిధాల ప్రయత్నించారన్నారు.


ఆకేపాటి అమరనాథరెడ్డితో గల్ఫ్, కువైట్ వైఎస్సార్‌సీపీ నేతలు

కానీ రాజంపేట జగనన్న నాయకత్వాన్ని ప్రజలు బలపరిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారని పేర్కొన్నారు. కువైట్ కో–కన్వీనరు రమణయాదవ్, మర్రి కల్యాణ్‌లు మాట్లాడుతూ ఎవరైతే పార్టీలో పదవులు పొంది, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు, ఆఖరి నిమిషంలో పచ్చ కండువాలను కప్పుకున్న వారిని తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఆకేపాటి, కొరముట్ల మాట్లాడుతూ గల్ఫ్ నుంచి వచ్చి పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా కువైట్ నుంచి ఎక్కువ మంది వచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ షేక్ జాఫర్‌అలీ, కువైట్ కమిటీ సభ్యులు షేక్ యాసిన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొరముట్లను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ నాయకులు

ముమ్మరంగా వాక్సినేషన్ ప్రక్రియ

సంబేపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రాన్ని జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ పరిశీలించారు. గురువారం ఆయన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను జిల్లా టీబీ అధికారి శైలజ, సంబేపల్లె వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ రెడ్డిలతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఆయన వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు.


సంబేపల్లె: వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జేడీ దేవసాగర్


నందలూరులో వ్యాక్సినేషన్ ప్రక్రియను తనిఖీ చేస్తున్న డాక్టర్ శరత్ కమల్

అడల్ట్ వ్యాక్సినేషన్ ఆకస్మిక తనిఖీ

నందలూరు(రాజంపేట) : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామంలో అడల్ట్స్‌కు ఏర్పాటు చేసిన బీసీజీ వ్యాక్సినేషన్‌ను మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కమల్ మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు నిండిన షుగర్ పేషెంట్లు, పొగ తాగేవారు, చికిత్సకాలం పూర్తయిన టీబీ పేషెంట్లు, క్లోజ్ కాంటాక్ట్స్, బీఎంఐ పేషెంట్స్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రజలు స్వచ్ఛంద ముందుకు వచ్చి టీబీ వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దనే టీబీ వ్యాక్సినేషన్

పుల్లంపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం ఇంటి వద్దనే వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామాలలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రత్యేక డాక్టర్ పర్యవేక్షణలో ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. గురువారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో అనంతంపల్లి గ్రామంలో క్షయవ్యాధి నివారణకు టీకాలు అందించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా ముందస్తుగా క్షయవ్యాధి అరికట్టవచ్చని, ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని వారు తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజ, ఏఎన్‌ఎం రాములమ్మ, వైద్య సిబ్బంది శరత్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


పుల్లంపేట: అనంతంపల్లెలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటరమణస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మొదటి రోజు ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూలవర్లకు ఉత్సవ విగ్రహములకు తిరుమంజన సేవ నిర్వహించారు.సాయంత్రం విశ్వక్సేనుడు ఆరాధన చేశారు. అంకుర్పారణ చేసి అర్చకులు, వేదపండితులు, కమిటీ సభ్యులు రక్షాబంధనం కంకణాలు ధరించారు. బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ విశ్వక్సేనుడు ఆహ్వానం పలికారు.

నాగదేవతల ఆరాధన

మదనపల్లె సిటీ: వీరబ్రహ్మేంద్రస్వామి 331 ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్థానిక కదిరిరోడ్డులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం సుప్రభాతసేవ, నాగదేవతల ఆరాధన నిర్వహించారు. పంచామృతాభిషేకం, హోమాలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేదమూర్తిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

గాలివీడు : మండల ప్రజలకు సుపరిచితుడు, మండల వాసి గాలివీడు సింగల్ విండో అధ్యక్షులు మిట్టపల్లె వేదమూర్తిరెడ్డి(77) బుధవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు మృతి పట్ల సంతాపం తెలిపి, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర డీఓపీ జిల్లా సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు వేదమూర్తిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను సానుభూతిని తెలియజేశారు. అనంతరం మిట్టపల్లె వేదమూర్తిరెడ్డి మృతదేహానికి గురువారం గాలివీడులో అంత్యక్రియలు నిర్వహించారు.


వేదమూర్తిరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు

పీలేరు రూరల్: పీలేరులో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండు జలమయమైంది. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు బస్టాండులోకి చేరుకోవడంతో బస్టాండులోని దుకాణాల వద్ద వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ అధికారులు వర్షపు నీరు బస్టాండులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 24.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. ఎల్‌బీఎస్ రోడ్డు వర్షపు నీరు ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.


జలమయమైన ఆర్టీసీ బస్టాండు